క్లుప్తంగా

విశ్వ బ్రాహ్మణ సంఘ కోశాధికారిగా శ్రీనివాసాచారి


శ్రీనివాసాచారిని సన్మానిస్తున్న సంఘ పెద్దలు

అద్దంకి: రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘ కోశాధికారిగా నియమితులైన పట్టణానికి చెందిన చెన్నుపల్లి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్యాలయంలో నిర్వహించారు. దానిలో భాగంగా కేక్ కట్ చేసి, శ్రీనివాసాచారిని దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుచారి ఈ అవకాశం కల్పించిన పెద్దకు ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర కార్యదర్శి పొన్నపల్లి బ్రహ్మనందం, ప్రకాశం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కుందుర్తి సీతారామాంజనేయులు, ప్రకాశం జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు తొవ్వపాటి జనార్దనాచారి పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కాకర్ల వెంకటేశ్వరరావు

చీరాల: భారతీయ జనతా పార్టీని సంస్థాగతంగా బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి కాకర్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో చీరాల మండల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ మండల అధ్యక్షుడు బక్కా మనోహర్‌రెడ్డి అధ్యక్షత వహించగా పార్లమెంట్ కన్వీనర్ బండారుపల్లి హేమంత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీని మరింతగా బలోపేతం చేయాల్సి ఉందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ దేశ ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. పట్టణ మాజీ అధ్యక్షుడు శంకరశెట్టి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షురాలు జి.భవాని, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు నాశిన మణికుమార్, మేడికొండ భరణీరావు, కాకుమాను సుబ్బారావు, శివాజీ, ఎం.సుజాత, శవనం రామస్వామిరెడ్డి, హనుమంతరావు, తడవర్తి రఘునాథ్, పేర్ల బ్రహ్మయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన బడ్జెట్


మార్టూరు స్టేట్ బ్యాంక్ సెంటర్‌లో నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

మార్టూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన బడ్జెట్ అని సీపీఎం నాయకులు బత్తుల హనుమంతరావు అన్నారు. మార్టూరు స్టేట్ బ్యాంక్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో బడ్జెట్ వ్యతిరేక నిరసన ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ అన్నిరంగాలకు బడ్జెట్‌లో నిధులు తగ్గించారన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాని పరిస్థితిలో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు వై. రాంబాబు, బి. సూరిబాబు, ఎస్. గఫూర్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

పర్చూరులో రోడ్డు మార్జిన్‌ల ఆక్రమణ


జాగర్లమూడి మలుపు వద్ద ఆక్రమణకు గురైన ప్రాంతం

పర్చూరు(చినగంజాం): పర్చూరులో రోడ్డు మార్జిన్ కనబడితే చాలు ఆక్రమణ దారులు వెంటనే వాలిపోతున్నారు. ఆక్రమణల వలన ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉన్న ఆక్రమణదారులు లెక్క చేయడం లేదు. దానికి తోడు అధికారుల అండదండలు కూడా పుష్కలంగా ఉండటంతో మరింత రెచ్చిపోతున్నారు. స్థానికంగా వ్యవసాయ మార్కెట్ ప్రక్క జాగర్లమూడి మలుపు వద్ద యథేచ్ఛగా రోడ్డు మార్జిన్‌లను ఆక్రమించుకొని కొందరు షాపులను ఏర్పాటు చేసుకున్నారు. ఈ ప్రాంతంలోని మలుపు ప్రమాదకరంగా మారింది. గతంలో ప్రమాదాలు జరిగి కొందరు మృత్యువాత పడగా అనేకమంది క్షతగాత్రులయ్యారు. పర్చూరు నుంచి జాగర్లమూడి వైపు వెళ్ళే మలుపులో ఏర్పాటు చేసిన షాపుల వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. షాపులు ఏర్పాటు చేస్తున్నా పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రయాణికులు మండి పడుతున్నారు.

ఈ మలుపులు.. ప్రమాద పిలుపులు

- కారంచేడు మండలంలో ప్రమాదరకరంగా ఉన్న రోడ్లు
- ప్రమాదాలు జరుగుతున్నా స్పందించని అధికారులు


ప్రమాదకరమైన మలుపులతో ఉన్న రహదారి

కారంచేడు: గ్రామీణ రోడ్లు నరకంగా మారుతున్నాయి. గ్రామీణ ప్రాంత రహదారులను సైతం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని అధికారులు గొప్పలు చెప్పుకోవడమే గాని క్షేత్రస్థాయిలో గ్రామాలను అనుసంధానం చేసే రహదారులు పరిస్థితి దయనీయంగా మారింది. మండలంలోని స్వర్ణ–చీరాల దండుబాట రహదారిలో ఉండే ప్రమాదకమైన మలుపులు ప్రయాణికులను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కన్ను మూసి తెరిచే లోపులోనే ప్రమాదం ముంచుకొస్తోంది.

అనేక గ్రామాలకు అనుసంధానమైన రోడ్డు..

చీరాల నుంచి స్వర్ణ, కొడవలివారిపాలెం, తిమిడెదపాడు, స్వర్ణపాలెం, రంగప్పనాయుడువారిపాలెం, దగ్గుబాడు, తిమిడెదపాడు, పోతినవారిపాలెం, నాయుడువారిపాలెం, హనుమోజీపాలెం, జరుబులవారిపాలెం, ఇంకొల్లు ప్రాంతాలకు వెళ్ళాలంటే ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, లారీలు ఈ రహదారి పైనే ప్రయాణిస్తుంటాయి. స్వర్ణ–చీరాల గ్రామాల మధ్య ఉండే 6 కిలోమీటర్ల దూరంలో ఎన్నెన్ని భయంకరమైన మలుపులున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. స్వర్ణ పెట్రోల్ బంక్ సమీపంలోని మలుపులో గతంలో ద్విచక్రవాహనం పై వెళ్తున్న వ్యక్తి బైక్ అదుపుతప్పి మలుపులోని కాలువలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డు మార్జిన్ సరిగా లేక ఇదే రోడ్డులో ఉన్న టపాసులు గోడౌన్ సమీపంలో చీరాలకు చెందిన 108 వాహనం సైతం పల్టీ కొట్టింది. ఇక ద్విచక్రవాహనాలు, ఆటోలకు ఎన్ని ప్రమాదాలకు గురయ్యాయో, ఎంత మంది గాయాలపాలయ్యారో లెక్కలేదు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న ఈ రోజుల్లో వ్యవసాయ కూలీలతో వెళ్ళే ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ రహదారిలో రొంపేరు కుడి కాలువ ప్రవహిస్తోంది. కాలువ సమీపంలో ఉండే వంతెనలకు వేసిన మలుపుల్లో కూడా అనేక ప్రమాదాలు జరుగుతుంటాయి. వీటికి తోడు ఇదే దండుబాటలో రోడ్డుకిరువైపులా దట్టంగా పెరిగి ఉండే ముళ్ల కంపలు కూడా ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. దట్టంగా పెరిగిన చిల్లచెట్ల వలన ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదకరమైన మలుపుల్లో ఎత్తుపల్లాలు, మోకాటిలోతు గోతులు ప్రయాణికులకు ఇబ్బంది పాలు చేస్తున్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డుకిరువైపులా ఉండే చిల్ల చెట్లను తొలగించి రహదారుల్లో మలుపులను తగ్గించేలా కృషి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.


స్వర్ణ–చీరాల రోడ్డులో వ్యక్తి మృతి చెందిన మలుపు ఇదే..

> **మలుపులను తగ్గించాలి**
>
> స్వర్ణ గ్రామం నుంచి చీరాలకు ప్రయాణం చేయాలంటే సమస్యగా ఉంది. ప్రమాదకరమైన మలుపులు, వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతుంటాయి. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతుంటాయి. మలుపులను తగ్గించే ఏర్పాట్లు చేయాలి.
>
> – ఎస్. వెంకటరమణారావు, స్వర్ణ

> **ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి**
>
> ఈ రహదారిలో నిత్యం వేల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, ఆటోలు ప్రయాణం సాగిస్తుంటాయి. ఈ రహదారిలో అనేక చోట్ల ఉండే మలుపులతో ఇబ్బందిగా ఉంది. సంబంధిత అధికారులు మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలి. హెచ్చరిక బోర్డులతో పాటు, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు కూడా ఏర్పాటు చేయాలి.
>
> – పి. శ్రీనివాసరావు, కేశవరప్పాడు

72 మందికి వైద్య పరీక్షలు


వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ చీరాల, హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రక్త నాళాల (వెరికోస్ వీన్స్) ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ సోమాచారి పర్యవేక్షణలో వైద్యపరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 72 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వీరిలో 30 మందిని సర్జరీ నిమిత్తం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించిందని క్లబ్ సభ్యులు తెలిపారు. క్లబ్ సభ్యులు చందలూరి బాలవెంకటేశ్వరరావు, పోలుదాసు రామకృష్ణ, బి.హేమంత్‌కుమార్, డి.వి.సురేష్, కె.శ్రీనివాసబాబు, జాలాది కృష్ణ ప్రతాప్, జాగర్లమూడి సురేష్, జీవై ప్రసాద్, శ్రీనివాసరావు, డాక్టర్ బాబూరావు, డాక్టర్ పున్నారావు, నిత్యానంద లాల్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీరాల అర్బన్: జాండ్రపేటలోని 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దేవాంగపురి, రామకృష్ణాపురం, సాల్మన్‌సెంటర్, పాతచీరాల, కొత్తపాలెం, గాంధీనగర్ పంచాయతీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈమేరకు డీఈఈ బి.హరిప్రసాదరావు ఆదివారం తెలిపారు.

8న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక కల్యాణం

బల్లికురవ: మండలంలోని కొణిదెన గ్రామంలోని బ్రహ్మకుండంలో వేంచేసి ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 5వ వార్షికోత్సవం కల్యాణోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం అంకురార్పణతో గణపతి పుణ్యాహవచనం పంచగవ్య ప్రాసన, మండపారాధన, హోమాలు, శనివారం ఉదయం గణపతి పూజ సుదర్శన హోమం, రుద్రాభిషేకం, కల్యాణోత్సవం, నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవ విగ్రహాన్ని కొణిదెన గంగపాలెం గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా పాల్


పాల్‌కు పార్టీ కండువా కప్పుతున్న నాయకులు

చీరాల రూరల్: బహుజన్ సమాజ్ పార్టీ చీరాల మండల అధ్యక్షుడిగా వాడరేవుకు చెందిన మైలపల్లి పాల్ నియమితులయ్యారు. స్థానిక ఐక్యనగర్‌లోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నియోజకవర్గ అధ్యక్షుడు గొర్పెపాటి రవికుమార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. పాల్‌ను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. అలానే చీరాల నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా పఠాన్ కలామ్‌ను, చీరాల పట్టణ ఉపాధ్యక్షుడిగా రమణను ఎంపిక చేసినట్లు చెప్పారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ బహుజన్ సమాజ్ పార్టీని చీరాల నియోజకవర్గంలో బలోపేతం చేసే దిశగా పనిచేస్తున్నట్లు చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం సెక్టార్ కమిటీలు, బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అంబేడ్కర్, కాన్షీరామ్ అడుగు జాడల్లో వారు నేర్పిన సిద్ధాంతాలతో పార్టీని నడిపిస్తున్నట్లు చెప్పారు. ఇన్‌చార్జ్ కాటి మార్క్, నాయకులు దుడ్డు భాస్కరరావు, సుధాకరరావు, మల్లి బాబురాజు, తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం మాఘ మాసం రేవతి నక్షత్రం పంచమి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

గంగమ్మతల్లికి ఆడపడుచు పొంగళ్లు


కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి, మొక్కులు చేసుకుంటున్న భక్తులు

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న గంగమ్మ తల్లికి గ్రామ ఆడపడుచులు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. ఆదివారం వేకువజాము నుంచే ఆడపడుచులు పెద్ద ఎత్తున తలంటు స్నానాలు ఆచరించి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంటలు బాగా పండాలని, మంచి దిగుబడులు రావాలని, పండించిన పంటలకు మంచి గిట్టుబాటు ధరలు కల్పించాలని, పిల్లలు లేనివారు సంతానం కావాలని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. చిన్నారులకు మంచి విద్యాబుద్ధులు ప్రసాదించాలని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా శ్రీరాముల వారి విగ్రహావిష్కరణ


ఆవిష్కరించిన శ్రీ రాముల వారి విగ్రహం

వేటపాలెం: మండల పరిధిలోని కొత్తపాలెం రోడ్డులో గల దత్తక్షేత్రం ప్రాంగణంలో శ్రీ రామస్థూపంపై భక్తిశ్రద్ధలతో శ్రీరామచంద్రుని విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ కన్వీనర్ ప్రమీలదేవి, అధ్యక్షుడు ప్రతి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ నూతనంగా తయారు చేసిన స్వామి వారి విగ్రహాన్ని క్షేత్రం ఆవరణలో ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో క్షేత్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష డప్పుల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


అంబేడ్కర్ భవన్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

చీరాల రూరల్: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు మద్దతుగా పద్మశ్రీ కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 7న హైదరాబాద్‌లో తలపెట్టిన లక్ష డప్పులు, వేల గొంతుల కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఎమ్మార్పీఎస్, ఎంఎఈఎఫ్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా నాయకులు బుడంగుంట్ల లక్ష్మీనారాయణ, దుడ్డు వందనం, వంగిపురపు రమేష్ మాట్లాడారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి చీరాల ప్రాంతంలోని మాదిగ సోదరులు, ఉద్యోగులు, యువకులు, వేలాది తరలిరావాలని కోరారు. ప్రపంచంలో ఎక్కడా జరగని విధంగా లక్షలాది డప్పులతో వేలాది గొంతులతో కళాకారులతో గొప్ప సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. బొంత అంకయ్య, దుడ్డు ఆశీర్వాదం, తేళ్ల రాంబాబు, మాజీ కౌన్సిలర్లు అనపర్తి రత్నబాబు, కావూరి అగస్టిన్, పండ్లూరి దేవా, మాధవ్, స్టాలిన్, రాజేష్, అశోక్, అవినాష్ పాల్గొన్నారు.

హైదరాబాద్ సభకు తరలిరండి

బల్లికురవ: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 7వ తేదీ హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు వేల గొంతులు భారీ సభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు కందుకూరు పేతురు మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని వల్లాపల్లి గ్రామంలో బహిరంగ సభకు సంబంధించి పోస్టర్‌ను కరపత్రాలను ఆవిష్కరించారు. స్థానిక నేతలు పాల్గొన్నారు.


వల్లాపల్లిలో పోస్టర్ ఆవిష్కరణ

వైభవంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ


అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న కరణం వెంకటేష్ దంపతులు

చీరాల టౌన్: మండలంలోని పిట్టవారిపాలెంలో నూతనంగా నిర్మాణం చేసిన శ్రీ అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న హోమాలు, యజ్ఞాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం పండితుల మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా అభయాంజనేయస్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తుల సమక్షంలో ప్రత్యేకంగా తెచ్చిన క్రేన్ సాయంతో అభయాంజనేయ స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేశారు. చీరాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబు ఆయన శ్రీమతి కరణం గీత ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హాజరయ్యారు.

వేటపాలెం: స్థానిక బైపాస్ రోడ్డు జంక్షన్ వద్దగల లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య దేవ స్థానం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దేవస్థానంలో పాలేటి అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామంలో నగరోత్సవం నిర్వహించి ప్రత్యేక హోమాలు చేశారు. చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అమ్మవారిని దర్శించుకున్నారు.

వెంకాయమ్మకు నివాళులర్పించిన బత్తుల


వెంకాయమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి

పర్చూరు(చినగంజాం): మండలంలోని నూతలపాడు గ్రామానికి చెందిన బొందలపాటి వెంకాయమ్మ భార్య మృతి చెందడంతో ఆమెకు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, వైఎస్సార్ సీపీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి నివాళులర్పించారు. ఆదివారం నూతలపాడు గ్రామంలోని భౌతిక కాయాన్ని సందర్శించి భర్త శేషిరెడ్డితో పాటు బంధువులను పరామర్శించారు. పర్చూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పోలూరు శివారెడ్డి, ఆరే గిరిధర్ రెడ్డి, వంకాయలపాడు మాజీ సర్పంచ్ భవనం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలతో విజ్ఞానం


పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

అద్దంకి రూరల్: పుస్తకాలు చదవటం వల్ల విజ్ఞానం వస్తుందని సంతమాగులూరు శాఖ లైబ్రేరియన్ బాదం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయంలో విద్యార్థులచే పుస్తకాలు చదివించారు. 19 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

తీరంలో సండే సందడి


తీరం ఒడ్డున సౌకర్యాలు లేకపోవడంతో ఎండలోనే ఇబ్బందులు పడుతున్న దృశ్యం

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు సముద్రతీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. సెలవు దినం కావడంతో చీరాల, పర్చూరు, గుంటూరు, చిలకలూరిపేట ప్రాంతాలకు చెందిన పర్యాటకులతో పాటు, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వాడరేవుకు చేరుకున్నారు. తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆనందంగా గడిపారు. కేరింతలు కొడుతూ స్నానాలు చేస్తూ సముద్రపు మన్నుతో ఆటలాడుకుంటూ సరదాగా గడిపారు. ఆదివారం వాడరేవుకు అధికసంఖ్యలో పర్యాటకులు వస్తారని అధికారులు, పంచాయతీ సిబ్బందికి తెలిసినప్పటికీ కనీసం వసతులు కల్పించలేదు. మహిళలు దుస్తులు మార్చుకోవడానికి, తాగునీరు, నిలువనీడ లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వసతులు కల్పించి, గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకే టోల్‌గేట్ ఏర్పాటు చేసి కార్లుకు, ఇతర వాహనాలకు టోల్ పన్ను వసూలు చేస్తున్నామని కూటమి నేతలు చెబుతున్నారు. అయితే వారాంతాలు, శెలవు దినాల్లో ఎందుకు వసతులు కల్పించడం లేదో చెప్పాలని పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు.


సముద్రంలో కేరింతలు కొడుతూ స్నానాలు చేస్తున్న పర్యాటకులు